# విడాకుల విదియ

## (వ్రత కథ)

నైమిశారణ్యంబున సూతుడు శౌనకాది మహర్షులంజూచి ఇట్లనియె: "మునీశ్వరులారా! మీ రడిగినప్రశ్న అంత కఠిన మైనది కాదు. కాని ప్రమాదకర మైనది. కలియుగమున నిటు వంటి సమస్య లుద్భవించునని దూరదృష్టు లెరింగినదే. దీనికి ప్రతిక్రియగూడ నున్నది. కాని, అది స్త్రీలకు దెలిసిన పురుషు లలో నసంతృప్తి బయలుదేరును. అసంతృప్తి విప్లవమునకు బీజరూపము గద! అందుచేతనే పరమేశ్వరుడు దానిని గోప్యముగ నుంచెను. ఇపుడు మీ రింతగ నడుగుచున్నారు గాన చెప్పెదను వినుడు:

"తొల్లి కాశీనగరమున సురుచియను రాచకన్నియ కలదు. ఆమె కడు నిష్ఠావతి. అసమాన రూపవతి. మిగుల సేవాధురీణ. ఆమెనిష్టచూచి బ్రాహ్మణకన్యలు సిగ్గుపడెడివారు. రూపము చూచి వైశ్యవనిత లీసుజెందెడివారు. సేవాపటుత్వము చూచి శూద్రస్త్రీలు తలలు వంచుకొనెడివారు. ఆమె నిండు యౌవనముతో పొంగు తమకమున నెల్లవేళల భర్తను దని యింప బ్రయత్నించెడిది. కాని యామెకు భర్త సాంగత్య మటులుండ దర్శనమే లభించెడిది కాదు. నిరంతరము రాచ నగరి నుండవలసినవా డగుటచే నతనికి నిజాంతఃపురమునకు రా వలనుపడెడిది కాదు. ఒక్కొక్కతరి యర్ధరాత్రమున వచ్చినను వెంటనే భోజనముచేసి శయ్యపై మేను వాల్చెడి

వాడు. సురుచి భుక్తశేషము నారగించి భర్తసేవకై వచ్చువరకతడు గుఱ్ఱుపెట్టుచుండెడివాడు. మరల తెల్లవారుజాముననే కొలువునకు వెళ్లెడివాడు. ఇటుల నిత్యమామె యాసలడియాసలయ్యెడివి. కోరికలు కొండనెక్కెడివి. ఆమె యౌవన మడవిగాచిన వెన్నెలయైనది; జీవిత మెడారి యైనది. ఆమె పట్టరాని వ్రతములు పట్టినది; నోమరాని నోములు నోచినది. కాని రాజాంతఃపురాంగనల నోముల ముందివి కొరగానివైనవి. భర్త యనుగ్రహమామెకు కలుగనేలేదు. కాని భగవదనుగ్రహము కలిగి మరుజన్మమున నామె నిష్ఠావతియై జన్మించినది.''

విచార ముప్పతిల సూతునికంఠము డగ్గుత్తిక పడెను. వారించుక కమండలోదకము సేవించి మరల నిట్లు చెప్పిరి:

''తొల్లిటి పాతివ్రత్యమువలన నిష్ఠావతికి దొల్లింటి భర్తయే లభించెను. కాని, యామె కీ జన్మమునందుకూడ నైహిక సౌఖ్యములు, దైహికవాంఛలు తీరలేదు. భర్త వేశ్యాలోలుడై యామెను జూచిన జిటపటలాడుచుండెను. సురుచికి గనీసము నోములు నోచుకొను స్వాతంత్ర్య ముండెడిది. నిష్ఠావతి కదియును గరవయ్యెను. వ్రతము ప్రారంభింపగనే భర్త, విశ్వామిత్రుని యాగధ్వంసము చేసిన మారీచుని పగిది, నడ్డుపడెడివాడు. నిష్టావతి కీ పారతంత్ర్యము కరము దుఃఖకరముగ దోచెను. ఏప్పుటకుగూడ నామెకు స్వాతంత్ర్యములేదు. భర్తచాటున విలపింపవలసి వచ్చెను. ఇది యిటులుండ, నొకనాడు భూలోకమును బాలించుటకు వచ్చిన పార్వతీ పరమేశ్వరులకీ యేడుపు చెవిని బడినది.

పార్వతి బలవంతము సేయ నిద్దరు, వృద్ధ బ్రాహ్మణ దంపతుల వేసముతో నిష్ఠావతి కడకు వచ్చి—"ఏమమ్మా! ఎందులకు నేడ్చుచుంటి"వని యడిగిరి. అందుల కామె విసువుతో "మీరేమి ఆర్చెడివారా? తీర్చెడివారా? అవలకు బొం"డనియెను. అప్పుడు పార్వతి మందహాసముచేసి "ఆర్చెడివారము మేమే, తీర్చెడివారము మేమే. చెప్పవలసిన"దనియెను. అంతట నిష్ఠావతి శోకముమాని 'వృద్ధులారా! మీ దాంపత్యము జూచిన నాదుఃఖ మిబ్బడించుచున్నది. అయినను తమరింతగ గోరితిరిగాన జెప్పుచున్నాను. నాభర్త వేశ్యాలోలుడై నన్నుజూచిన జిటపట లాడుచుండును. వారి మనసు నాయందు లగ్నమగుటలేదు. నా దుఃఖమున కిదియే కారణ" మనియెను.

పార్వతి "నీవు కైలాసగౌరి నోము నోచితివా?" అనెను.

"నోచితిని. ఇంకను పువ్వుల తాంబూలపు నోముకూడ నోచితిని. కొన్నింటికి నా భర్త యడ్డుపడెను గాని నేను జాటుగ నుద్యాపనము చేసితి" నని నిష్ఠావతి. చెప్పెను.

పార్వతికి నాశ్చర్యక్రోధము లొక్కమాటుగ గలిగెను.

"ఏమి? కైలాసగౌరినోము నోచినను భర్త సాంగత్యము లభింపలేదా?" యని గర్జించెను. "లేదు తల్లీ! నే ననాలోచితముగ నెల కిరువదియైదు దినములు వ్రతముకొరకు వ్యర్థపుచ్చితి" నని నిష్ఠావతి పశ్చాత్తాపము చెందెను.

అప్పుడు పరమేశ్వరుడు "అమ్మా! నిజము చెప్పవలసిన దోసము నీయందునను గలదు. నీవు పరోక్షదైవము నారాధించి ప్రత్యక్షదైవమునకు గోపము దెప్పించితి" వని చెప్పె

చుండ పార్వతి యడ్డుపడి భర్తతో యీ విషయమై వాదు లాడెను. శివుడు శాంతముగ భార్యకు దగువిధమున జవాబు చెప్పి, నిష్ఠావతితో నిట్లనెను:—"అమ్మా! నీభర్త నాస్తికు డైనాడు. అతనిని సంస్కరించి యతని మనస్సు నీపై మరలు నట్లుచేయుట మా కసాధ్యము. భగవద్ద్రోహులను రాజ ద్రోహులను శిక్షించవలసినదే గాని సంస్కరించ లేము." అప్పుడు నిష్ఠావతి మిగుల గుంది, "తండ్రీ! మీ భక్తు రాలినోము లంత కొరగానివా? ఆమె కనీసము పుణ్య స్త్రీవలె నుండదగదా?" యని ప్రశ్నించెను.

"ఎందులకు దగదు? నీ పూర్వపుణ్య మింకెన్నియో జన్మములవరకు నీకు బుణ్యాత్వ (అయిదవతన) మొసగుటయే గాక ఈ పతినే నీకు భర్తగా యనుగ్రహించును. ఇక నీ పాతివ్రత్యమే నీ భర్తకు గవచము. నీ కిష్టములేనిదే యతని సిగ పూవు వాడ"దని శివుడామెకు పూర్వజన్మవృత్తాంతము వినిపించెను. సురుచికథ నిష్ఠావతి కాశ్చర్యమును, పార్వతికి గోపమును కలిగించెను. ఆమె కృద్ధ భుజంగినివలె ఘూత్కా రముసేసి "ఎటు లెటులు? ఈ లంపటుడు జన్మజన్మముల భర్త యగుటయా, ఈయమ యార్జించిన పుణ్యమునకు ఫలము? ఇదేటి న్యాయము? ఎవరు నిర్మించిన ధర్మ సూత్రము? ఈ యన్యాయమును రూపుమాపనిదే నేను కైలాసమునకు రాను. మీరు పొం"డనియెను.

"పరమేశ్వరునకు గత్యంతరము కనుపించక నారదుని మానసమున దలచెను. అతడు వచ్చిన పిమ్మట చాటున నిద్దరు మంత్రాంగము సలిపిరి. తుదకు శివుడు నారదునిబంపి

పార్వతియొద్దకు వచ్చి శాంతవచనములతో నిట్లనియెను: "మనోహరీ! యెందుల కంత రాగము? నేను నీవు తలచు నంత శక్తివంతుడను గాను. ప్రేయసీ! నీ కసలు రహస్యము చెప్పెదను, వినుము; ప్రజల కిష్టములేని ప్రభు వెంతకాలము పరిపాలన సేయగలడు? అటులనే భక్తుల కిష్టములేని భగవంతుడుకూడ. ప్రభువు, భగవంతుడు నిమిత్తమాత్రులు. వీరి పేరుతో, ప్రజలు, భక్తులే చట్టములు, సూత్రములు నిర్మించెదరు. వీటికి ప్రభువు, భగవంతుడుకూడ తలయొగ్గి యుండవలసినదే. ఎదిరించిన పదభ్రష్టత తప్పదు."

పార్వతి అభిమానముతో "ఐన నీ కీలుబొమ్మప్రభుత్వమెందుకు? ఈ పగటివేషములతో బనియేమి?" అనెను.

శివుడు–"ఉన్నది. మనము దీనిని వదలుకొనినచో భక్తులు ఈభార మింకొక యసమర్థుని మూపున నిడెదరు. అపుడీ మాత్రపు మేలుగూడ ప్రపంచమునకు జరుగదు. నిజము చెప్పవలసిన నీకపుడీ వాక్స్వాతంత్ర్యము బొత్తుగ నుండదు."

పార్వతి కీడెంచి భయకంపితురాలాయెను. ఆమె ముఖమున దైన్యముదోప భర్తతో ప్రార్థనాస్వరమున "అయిన నీమెకు విమోచన లేదా?" యని యడిగెను.

"ఈ జన్మమున లేదు. కాని, ఈమె కోరినచో ముందు జన్మమందీ భర్త లభింపకుండునటుల నొక వ్రతముపదేశింపగలను. ఏమమ్మా! చెప్పుదునా?" యని పరమేశ్వరుడు నిష్ఠావతి నడిగెను. "చెప్పుము. అంతకంటె గత్యంతర మేమున్నది? పాప మీమె ముందుజన్మమందైనను సుఖపడు"నని పార్వతి యనెను.

శివుడు మరొకమాటు నిష్ఠావతి నడిగి, ఆమె తలనాడించ నిట్లనియెను: "అమ్మా! ఈ వ్రత మొనర్చుటకు దగు జాగరూకత యవసరము. ఈ వ్రతమాహాత్మ్యము భర్తకుగాని, తదితరులకుగాని తెలియఁగూడదు. తెలిసిన ఫల ముండదు. దీని నామము విడాకులవిదియ. నామాంతరము విమోచన విదియ. భాద్రపద శుద్ధవిదియ దీనికి పర్వతిథి. కాని యేవిదియయందైనను చేయవచ్చును. ఆనాడు తెల్లవారుజామున లేచి తలార స్నానముచేసి నిండుమనమున కాగోరు భర్తను స్మరించవలెను. పిమ్మట దన కష్టములను భర్తయత్యాచారములను కథ నల్లి చెప్పుకొనవలయును. ఆనాడు భర్తతో మాట్లాడఁగూడదు. ఇటుల గ్రమముదప్పక నేడు సంవత్సరములు వ్రతముపట్టి యెనిమిదవ వత్సరమున భర్తకు బ్రియమగువస్తువులు— చెప్పులు, చేతికఱ్ఱ, తలపాగ మొదలగు వానిలో నేదేని నొకటి సంగ్రహించి తాంబూలముసహా సద్బ్రాహ్మణులకు దానమిచ్చి యుద్యాపనము చేసుకొనవలయును. ఇది నిర్విఘ్నముగ నెరవేర్చిన ముందుజన్మమున నీవు కోరినభర్త నీకు లభించు"నని యుపదేశించి పరమేశ్వరుడు పార్వతితో కైలాసమునకు వెళ్ళెను. నిష్ఠావతి విడాకుల విదియ వ్రతముపట్టి యుద్యాపనము సేసికొని మరుజన్మమున తనుకోరిన భర్తనుపొంది సకల సౌఖ్యముల ననుభవించెను" అని చెప్పి సూతుడు సాంధ్యప్రార్థనకు లేచినవాడాయెను.

ఉద్యాపనము:-దీనికి ఉద్యాపనము కథలో నున్నది. తదితర వ్రతనియమములే దీనికి వర్తించును. కథ లోపమున్నను వ్రతలోప ముండరాదు. భక్తి తప్పినను ఫలము తప్పదు.